సాక్షి చిత్తూరు

ఆదివారం । 16 । జూన్ । 2024



కార్మిక సమస్యలు పరిష్కరించాలి

కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సీపీటీయూ జిల్లా నేత సురేంద్రన్ కోరారు. - 8లో



శిలా ఫలకాల ధ్వంసం

బైరెడ్డిపల్లె మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. - 8లో



శ్రీకాళహస్తిలో విధ్వంసం

శ్రీకాళహస్తి సమీపంలోని రాజీవ్ నగర్‌లో పలు కట్టడాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తొలగించారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటి ముంగిటే నాణ్యమైన వైద్యం



సూచనలిస్తున్న ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ సుదర్శన్

యాదమరి(పూతలపట్టు): 104 సంచార వాహనం ద్వారా పల్లెల్లో ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్యం అందుతున్నట్లు ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ అన్నారు. శనివారం మండలంలోని బండివాండ్లవూరు గ్రామంలో 104 అంబులెన్స్ వైద్యసేవల ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఖర్చులేకుండా సొంతూర్లోనే నాణ్యమైన వైద్యం అందించడం కోసమే 104 ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఈ వాహనంలో వైద్య సిబ్బంది వచ్చి చిన్న చిన్న జబ్బులకు చికిత్సలు చేసి, మందులను అందిస్తారని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం నెలకు సరిపడా మందులను రోగులకు అందిస్తున్నట్లు తెలిపారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

19న కాణిపాకం హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ కానుకలను ఈనెల 19వ తేదీన లెక్కించనున్నట్లు దేవస్థానం ఈఓ వెంకటేశు తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటలకు ఆలయ మండపంలో లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. హుండీ లెక్కింపు పక్కాగా జరిగేలా అధికారులు, సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

578 విద్యుత్ కేసుల నమోదు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,095 సర్వీసులను తనిఖీ చేయగా, తిరుపతి అర్బన్‌లో 98, తిరుపతి రూరల్ 65, పుత్తూరు 93, చిత్తూరు అర్బన్ 49, చిత్తూరు రూరల్ 49, మదనపల్లె 98, పీలేరు 62, పుంగనూరు పరిధిలో 64 కేసులు నమోదు చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్‌కు సంబంధించి 534 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.12.64 లక్షలు, చౌర్యానికి సంబంధించి 44 కేసులకు గాను రూ.29 వేలు జరిమానా చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు టెక్నికల్ ఈఈ శ్రీనివాసులు వివరించారు.

ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా సురేంద్రనాయుడుకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఎస్‌ఈగా ఉన్న కృష్ణారెడ్డి వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. దీంతో కార్పొరేట్ కార్యాలయ ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ జీఎం సురేంద్రనాయుడుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పక్వానికి వచ్చిన కాయలనే కోయాలి

చిత్తూరు అగ్రికల్చర్: పక్వానికి వచ్చిన మామిడి కాయలనే కోయాలని రైతులకు ఉద్యానవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మామిడి దిగుబడి బాగా తగ్గిందన్నారు. దీంతో డిమాండ్ పెరిగి రైతులకు మంచి లాభాలు పొందాల్సి సమయమని తెలిపారు. మార్కెట్‌లో మామిడికి ధరలు నిలకడగా లేనందున రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. మామిడి దిగుబడిలో రైతులు కొంత అవగాహనతో వ్యవహరించి పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి విక్రయిస్తే మంచి ధర వస్తుందని పేర్కొన్నారు. కాయలను ర్యాంప్‌లకు తరలిస్తే తరుగుదల కింద టన్నుకు దాదాపు రూ.1,500 వరకు తక్కువ ధరకు విక్రయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. నేరుగా గుజ్జు పరిశ్రమలకు తరలించి మంచి ధరను పొందాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 66,782 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,229 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

పేదలకు జీవన ధార

ఒక రోగానికి అవసరమైన మందులు ఒకే ఫార్ములాతో తయారు చేసినా బ్రాండెండ్ పేరిట అధిక ధరలకు అమ్ముతున్నారు. అవే మందులు జనరిక్(జీవనధార) దుకాణాల్లో చౌకగా దొరుకుతున్నాయి. జనరిక్ మందులకు రోగులు అలవాటు పడితే బ్రాండెండ్ మందులను కొనరని పసిగట్టిన మెడికల్ దుకాణాల నిర్వాహకులు ఒక పద్ధతి ప్రకారం జనరల్ మందులకు అలవాటు చేశారు. సమాజంలో మార్పు మొదలైంది. రోగుల్లో జనరిక్ మందులపై అవగాహన పెరిగింది. దీంతో జనరిక్ షాపులకు వెళ్లి అవసరమైన మందులను కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఊరట పొందుతున్నారు.



జనరిక్‌లో 70 నుంచి 90 శాతం తక్కువ ధర

దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, బీపీ, గుండె, శ్వాసకోస వ్యాధులకు సంబంధించిన మందుల అవసరం ఎక్కువగా ఉంటుంది. మందుల ధరల్లో జనరల్‌కు జనరిక్‌కు మధ్య 80 శాతం వ్యత్యాసం ఉంటుంది. శానిటరీ నాప్కిన్స్ ఇక్కడ రూ.పదికి పది ఇస్తున్నారు. బీపీ ట్యాబ్లెట్ ధర సాధారణ మెడికల్ షాపులో స్ట్రిప్ రూ.120 కాగా జనరిక్‌లో రూ.17 మాత్రమే. గ్లూకో మీటర్ అక్కడ రూ.1500 కాగా ఇక్కడ రూ.525 మాత్రమే. అంటే బ్రాండెడ్ మందుల కంటే జనరిక్ మందులు 70 నుంచి 90 శాతం తక్కువగా లభ్యమవుతున్నాయి.

- చైతన్యంతో షాపులకు వస్తున్న జనం
- జనరిక్ మందులు రాయని వైద్యులు
- జిల్లాలో పలుచోట్ల పీఎంబీజేపీ మెడికల్స్ స్టోర్లు
- జనరల్, జనరిక్ మందుల ధరల్లో భారీ తేడా

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, మదనపల్లెలోనే 2 వేలకు పైగా ప్రైవేటు మెడికల్ దుకాణాలు ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో 4 వేలకు పైగా దుకాణాలు ఉంటాయి. వీటికి మందులను సరఫరా చేసే ఏజెన్సీలు వందకుపైగా ఉన్నాయి. అదే ఉమ్మడి జిల్లాలో జనరిక్ మెడికల్స్ పీఎంబీజేపీ(ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన) షాపులు 10 వరకు ఉండగా, ప్రస్తుతం 20 దాకా పెరిగాయి. ఇటీవల పలమనేరు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించారు.

తేడా ఏంటంటే...

సాధారణంగా ఫార్మా కంపెనీలు పరిశోధనలు చేసి మందును కనిపెడతాయి. దానిపై క్లినికల్ ట్రయల్స్ చేసి డగ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి పేటెంట్ పొందుతాయి. తద్వారా ఆ కంపెనీకి 20 ఏళ్ల సర్వ హక్కులు దక్కేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తుంది. దీంతో ఫార్మాకంపెనీలు మాత్రల తయారీకైన పెట్టుబడి ఖర్చులతో కలిపి ధర నిర్ణయించి మార్కెట్లోకి పంపుతాయి. 20 ఏళ్ల దాటిన తర్వాత ఆ కంపెనీ మందు ఫార్ములాను ఏ కంపెనీనైనా ఉపయోగించి ట్యాబెట్లను తయారు చేసుకోవచ్చు. అప్పుడు వాటి ధర తక్కువగా మారుతోంది. ఈ రెండింటిలోనూ ఒకే మందు ఉంటుంది. ఈ విషయాన్ని జనానికి తెలియకుండా బ్రాండెడ్ కంపెనీలు మసిపూస్తున్నాయి.

అణగదొక్కుతున్న బ్రాండెడ్ మెడిసిన్స్



జనరిక్ మందులు

అధిక లాభాలకు అలవాటు పడిన మెడికల్స్ నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో జనరిక్ షాపులు లేకుండా ఓ పద్ధతి ప్రకారం తొక్కేస్తున్నారు. ఇందులో వైద్యుల పాత్ర సైతం ఉంటోంది. బ్రాండెడ్ మందుల షాపుల వారు వైద్యులకు కమీషన్లు ఇస్తున్నారు. మెడికల్ ఏజెన్సీలు బహుమతులు, వార్షిక నగదు, టూర్ల సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. దీంతో వారు రోగులకు జనరిక్ మందులు కాకుండా బ్రాండెడ్ మందులు రాసున్నారు. ఆస్పత్రిలోనే ఉన్న తమ సొంత మందుల దుకాణంలో లభించే మందులనే రాస్తున్నారు.

కర్ణాటకకు వెళ్లే బాధ తప్పింది



షుగర్ మాత్రలు స్థానిక మెడికల్స్‌లో ఎక్కువ ధర ఉంది. కర్ణాటకలో జనరిక్ దుకాణంలో చౌకగా దొరుకుతున్నాయి. నేను ముళబాగిళు, కోలారు వెళ్లి మందులు కొనుక్కొంటున్నా. ఇక్కడికి అక్కడికి ధరల్లో 70 శాతం వ్యత్యాసం ఉంది. పీఎంబీజేపీ జనరిక్ దుకాణాన్ని పలమనేరులో ఏర్పాటు చేశారు. ఇలాంటి జనరిక్ షాపులను ప్రతి మండల కేంద్రంలోనూ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఆనంద్, బైరెడ్డిపల్లె

రెండింటిలో ఒకటే ఫార్ములానే...



బ్రాండెడ్, జనరిక్ మందుల్లో ఒకటే ఫార్మలా ఉంటుంది. బ్రాండెండ్ కంపెనీల మందులకు అలవాటైన జనానికి జనరిక్ మందులతో రోగం తగ్గదేమోననే అనుమానం ఉంటుంది. పైగా ధర చాలా తక్కువగా ఉండడంతో మేలైనవి కావేమో అని అనుకుంటారు. ఎలాంటి వ్యాధికైనా జనరిక్ మందులను ధైర్యంగా వాడొచ్చు. పేదలకు తక్కువ ధరకే మందులు దొరకాలన్న లక్ష్యంతో కేంద్రం వీటిని ప్రవేశపెట్టింది.

– ముదాసర్, ఫార్మసిస్ట్, జనరిక్ మెడికల్స్, పలమనేరు

కాణిపాకంలో రద్దీ సాధారణం



క్యూలో ఉన్న భక్తులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వేసవి సెలవుల నేపథ్యంలో నెలరోజులకు పైగా ఆలయం భక్తులతో కిక్కిరిసింది. శని, ఆదివారాల్లో భక్తుల సంఖ్య 35వేలు దాటేది. వేసవి సెలవులు ముగిసి విద్యాసంస్థలు తెరుచుకోవడంతో ఆలయానికి భక్తుల సంఖ్య తగ్గింది. శనివారం 20 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠం చెబుతూనే కుప్పకూలిన టీచర్

- నింద్ర హైస్కూల్‌లో విషాదం



మృతి చెందిన సురేష్‌బాబు

నింద్ర: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విషాదం చోటు చేసుకుంది. గణిత ఉపాధ్యాయుడు సురేష్ బాబు (51) గుండెపోటుతో మృతి చెందారు. శనివారం పాఠశాలలో తరగతి గదిలో విద్యార్థులకు పాఠం చెబుతుండగా గుండెపోటుతో కుప్పకూలారు. విద్యార్థులు ఇతర ఉపాధ్యాయులకు సమాచారం తెలపడంతో హుటాహుటిన నగరి వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పాఠం చెబుతూ టీచర్ కన్నుమూయడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు శోకసంద్రంలో మునిగారు. సురేష్‌బాబు నింద్ర బీసీ హాస్టల్, శ్రీరామాపురం హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్‌గా కూడా పని చేసేవారు. విద్యాశాఖ అధికారులు, పలువురు ఉపాధ్యాయులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

ఎర్రాతివారిపల్లెలో ఎమ్మెల్యే, ఎంపీ



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెకు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి శనివారం విచ్చేశారు. స్వగ్రామానికి వచ్చిన వారిని పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వారితో చర్చించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, ఇక్బాల్ అహమ్మద్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, సదుం, పులిచెర్ల ఎంపీపీలు ఎల్లప్ప, సురేంద్రనాథ రెడ్డి, కృష్ణా రెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఫకృద్దీన్ షరీఫ్, శివారెడ్డి, నారాయణ రెడ్డి, మురళీ రెడ్డి, బాబురెడ్డి, నాగభూషణం రెడ్డి, గణేష్ రెడ్డి, వెంకటస్వామి, నాదముని రెడ్డి, ఉషారాణి, శ్రీనివాసులు, శివ, ఇందాద్, మహేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

- జూలై 12 వరకు నేను బడికి పోతా ప్రత్యేక డ్రైవ్
- అధికారులకు డీఆర్వో పుల్లయ్య ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కార్పొరేషన్: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. శనివారం ఉదయం డీఆర్వో చాంబర్‌లో డీఈఓ దేవరాజులు, సర్వశిక్ష అభియాన్ పీఓ వెంకటరమణారెడ్డిలతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈనెల 13 నుంచి జూలై 12 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 'నేను బడికి పోతా' కార్యక్రమ నిర్వహణపై సూచనలిచ్చారు. డీఆర్వో మాట్లాడుతూ 6–14 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలందరూ చదువుకోవాలన్న ఉద్దేశ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన, బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, డీపీఓ, మెప్మా, కార్మిక శాఖాధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి 6–14 సంవత్సరాల లోపు పిల్లలు బడికి వెళుతున్నారా.. లేదా అని సర్వే చేయాలని, బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి చేర్చాలన్నారు.

జిల్లా స్థాయిలో కమిటీలు

కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీఆర్వో తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కోఆర్డినేటర్ చైర్మన్లుగా, వివిధ శాఖలకు సంబంధించి 14 మంది సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ చైర్మన్‌గా, ఎంఈఓ కన్వీనర్‌గా, పది మంది సభ్యులు ఉంటారని, గ్రామస్థాయి కమిటీలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కమిటీ చైర్మన్‌గా, హెడ్‌మాస్టర్ కన్వీనర్‌గా, ఏడుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. జూలై 12వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని వివరించారు. కమిటీలు సమన్వయంతో పనిచేసి బడి బయట పిల్లలు లేని సమాజాన్ని తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీఓ లక్ష్మి, బీసీ సంక్షేమ శాఖాధికారి రబ్బానీబాషా, సాంఘిక సంక్షేమ శాఖా.దికారి రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖాధికారి మూర్తి, మైనారిటీ సంక్షేమ శాఖాధికారి చిన్నారెడ్డి, మెప్మా పీడీ రాధమ్మ, కార్మిక శాఖ ఏఎల్‌ఓ జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు కట్టుదిట్టమైన భద్రత



అధికారులు,ముస్లిం మతపెద్దల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన ఎస్పీ మణికంఠ

- ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి
- ముస్లింలకు కలెక్టర్ షణ్మోహన్ సూచన

చిత్తూరు కార్పొరేషన్: బక్రీద్ పండుగను ముస్లింలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం జిల్లా సచివాలయం సమావేశ మందిరంలో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, సంబంధిత శాఖల అధికారులు, ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను ముస్లిం సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా జంతువులను వధించినా లేదా అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లా, పంచాయతీ స్థాయిలో జంతు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మసీదుల వద్ద పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టేలా డీపీఓ, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. భద్రత ఏర్పాట్లకు సంబంధించి పోలీస్ శాఖ తరపున ఏఎస్పీ (అడ్మిన్) ఆరీఫుల్లాను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా ఆయన దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, శిక్షణ కలెక్టర్ హిమవంశీ, ఏఎస్పీ (అడ్మిన్) ఆరీఫుల్లా, జెడ్పీ సీఈఓ గ్లోరియా, పశు సంవర్థక శాఖ జేడీ ప్రభాకర్, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి చిన్నారెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ హరినాథ రెడ్డి, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే

- టీడీపీ సునామీలోనూ పలమనేరులో ఓటు బ్యాంకు అలాగే ఉంది
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా
- మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



పార్టీశ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: సార్వత్రిక ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గంలో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ స్పష్టం చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ నేతల సమావేశం జరిగింది. తొలుత మండల నేతలను ఆప్యాయంగా ఆయన పలుకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ సునామీలోనూ పలమనేరులో మన ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని తెలిపారు. గత ఎన్నికల్లో మన ఓటు బ్యాంకు ఎంతైతే ఉందో ఈ ఎన్నికల్లోనూ నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. టీడీపీ ఇక్కడ గెలిచినా లక్షమందికిపైగా మన బలం మనకుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో జయాపజయాలు సాధారణమేనని దీనిపై ఎక్కువగా ఆలోచించకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షపాత్రను దీటుగా పోషించాల్సిన అవసరం తమపై ఉందన్నారు. టీడీపీ గెలిచిందని మన కార్యకర్తలు కుంగిపోకుండా ఈ ఐదేళ్ల మరింతగా కష్టపడాలని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

18న ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు కార్పొరేషన్: కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సమస్యల ఫిర్యాదులను అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

దాడుల సంస్కృతికి టీడీపీ స్వస్తి పలకాలి


మాట్లాడుతున్న జనార్దన్

పుంగనూరు: అధికారం ఉందని ప్రతిపక్షాల నాయకులపై దాడులు, వారి ఆస్తులు ధ్వంసం చేయడం తక్షణమే ఆపివేయాలని టీడీపీని సీపీఐ జిల్లా కార్యదర్శి జనార్దన్, పట్టణ కార్యదర్శి రామమూర్తి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదని సూచించారు. ప్రతిపక్షాలపై దాడులు, ఆస్తులు ధ్వంసం మంచిదికాదన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరమని తెలిపారు. దాడులను అధికార పార్టీ వారు తక్షణం ఆపివేసి, అభివృద్ధి చేపట్టాలన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారంతో భౌతిక దాడులకు పాల్పడితే భవిష్యత్తు ఉండదన్నారు. దాడుల్లో గాయపడిన వారికి తమ సానుభూతి ప్రకటించారు. ఇకనైన పోలీసులు ఇలాంటి వాటిని అరికట్టాలని, దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

కార్మిక సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సురేంద్రన్ మాట్లాడుతూ కార్మికులు అవస్థలు పడుతున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కొత్తగా ఎన్నికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీమ్ వర్కర్లకు నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. గిరిధర్‌గుప్తా, గంగరాజు, షకీ లా, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో విధ్వంసం

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన కట్టడాలను తొట్టంబేడు తహసీల్దారు శివరాముడు ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. అయితే కేవలం కక్షపూరితంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేశారని బాధితులు ఆరోపించారు. పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రాజీవ్‌నగర్‌కు చేరుకుని మయూర్‌నగర్ ఎదుట ఉన్న రెండు గదులు, రామచంద్రాపురంలోని కట్టడాలను కూలగొట్టారు. అనంతరం రహదారి పక్కనే నిరుపేదలు వేసుకున్న ఇళ్ల పునాదులను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ క్రమంలోనే ఓ ఇల్లు కూల్చేందుకు వెళ్లిన అధికారులకు సదరు ఇంటి యజమాని తనకు కమర్షియల్ కరెంట్, ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఉందని తెలియజేసినా వినిపించుకోలేదు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేతలకు దిగారని, ఇది కక్ష సాధింపు చర్య అని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. కరెంట్ కనెక్షన్ తీసుకుని మీటర్లు కూడా పెట్టుకుని పక్కా భవనాలు నిర్మించుకున్న తర్వాత ఇలా కూలదోయడం భావ్యం కాదని విమర్శించారు. ఇన్నేళ్లుగా పట్టించుకోని అధికారులు ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రాగానే ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు లత, అల్తాఫ్, కుమార్‌కు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని అధికారులను ప్రశ్నించారు. అదే విధంగా పట్టణంలోని పెద్దమసీదు వద్ద గల 20 ఏళ్లుగా పండ్ల దుకాణం నడుపుకుంటున్న వారికి సైతం కేవలం వైఎస్సార్ సీపీకి ఓటేశారనే కారణంతో వారి షాపును కూల్చేశారని ఆరోపించారు. దీనిపై స్థానిక ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు.



రాజీవ్ నగర్‌లో గోడలు, పునాదులు తొలగిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) కూల్చేసిన పండ్ల దుకాణం



> **అక్రమ కట్టడాలు తొలగించాం**
> రాజీవ్‌నగర్ కాలనీ ప్రధాన రహదారిని ఆనుకుని రోడ్డు పోరంబోకును ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించుకున్నారు. వాటిని పరిశీలించాం. శనివారం పునాదులను తొలగించాం. పక్కా కట్టడాలకు ఒకరోజు సమయం ఇచ్చాం. విద్యుత్ బిల్లులు వంటి వాటిని పరిశీలించి వాటిని తొలగిస్తాం.
> – శివరాముడు, తహసీల్దార్, తొట్టంబేడు


కట్టడాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు




పండ్ల దుకాణం కూల్చివేతతో ముస్లింల నిరసన


విద్యుత్ మీటర్లు తొలగించి తీసుకెళుతున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఒకరు వెంకటేష్‌పురానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి
- మైసూరు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు


విశ్వనాథ్(ఫైల్)

శాంతిపురం: మైసూరు–బెంగళూరు హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. మఠం పంచాయతీ వెంకటేష్‌పురం గ్రామానికి చెందిన వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పెద్దన్న కుమారుడు విశ్వనాథ్(21) బెంగళూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. స్నేహితుడు సూర్యతో కలిసి శుక్రవారం కారులో మైసూరుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో శుక్రవారం అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో బెంగళూరు నగరానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో వీరు ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్, సూర్య అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని, మృతదేహాలను రామనగర జిల్లా ఆస్పత్రికి స్థానిక పోలీసులు తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. విశ్వనాథ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి, ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

టెంపో ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం


మృతి చెందిన అబ్దుల్

వి.కోట : మండలంలోని వి.కోట–కుప్పం జాతీయ రహదారిలోని దాసార్లపల్లి గ్రామం వద్ద శనివారం టెంపో ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రామకుప్పం మండలానికి చెందిన మెకానిక్ అబ్దుల్ ద్విచక్ర వాహనంలో వి.కోట వైపు వస్తున్నాడు. ఇదే క్రమంలో కుప్పం వైపు నుంచి వి.కోటకు గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో టెంపో వస్తుంది. దాసార్లపల్లె వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి టెంపో వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న అబ్దుల్ టెంపో చక్రం కింద పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైరెడ్డిపల్లెలో శిలా ఫలకాల ధ్వంసం


బైరెడ్డిపల్లె ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను శుక్రవారం రాత్రి టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. ఈమేరకు శనివారం ఎస్ఐ కృష్ణయ్యకు వైఎస్సార్‌సీపీ నేత లు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా..మండలంలోని గుంతకుర్రపల్లె, మిట్టకుర్రపల్లె గ్రామాలకు సిమెంటు రోడ్డును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేశారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకం శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. బైరెడ్డిపల్లెలో రూ.1.51 కోట్ల నిధులతో ప్రభుత్వాస్పత్రిని నిర్మించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను కూడా టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు సంఘటన స్థలాలను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచ్‌లు వెంకటేష్, రమణారెడ్డి, రాజప్ప, బాలకృష్ణగౌడు, నేతలు జయకుమార్, తబ్రాజ్, మహేష్, కార్తిక్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీపై కాపు సామాజిక వర్గం దాడి

- దళిత యువకులపై అమానుషం
- 15 మందిపై అట్రాసిటీ కేసు నమోదు
- బొమ్మన్‌దొడ్లలో పోలీస్ పికెటింగ్

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మన్‌దొడ్ల ఎస్సీ గ్రామంపై కాపు సామాజిక వర్గం విచక్షణా రహితంగా దాడి చేసింది. ఎస్సీ కాలనీలో చొరబడి దళిత యువకులపై అమానుషంగా దాడి చేసి గాయపరచడంతో 15 మందిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సీలకు రక్షణగా ఆ గ్రామంలో పోలీసు పికెటింగ్ నిర్వహిస్తున్నారు. నగరి డీఎస్పీ కేఎస్‌మూర్తి కథనం మేరకు...మండలంలోని బొమ్మన్‌దొడ్ల ఎస్సీ కాలనీకి చెందిన కె.బాలు, హరీష్ రామచంద్రాపురం మండలం కుప్పం బాదూరు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్న సమయంలో వెదురుకుప్పం మండలం కోణంగిపల్లె గ్రామానికి చెందిన రుక్మాంగధరెడ్డి, అతని అనుచరుల మధ్య తగాదాలు ఏర్పడ్డాయి. శుక్రవారం బందార్లపల్లె సమీపంలో ఇరు వర్గాల వారు ఓ మామిడి తోటలో విడివిడిగా మద్యం సేవిస్తున్న క్రమంలో రగడ రాజుకుని వివాదం తలెత్తింది. ఈక్రమంలో రుక్మాంగధరెడ్డిని చితకబాదారు. దీంతో రుక్మాంగధరెడ్డి తన అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి బొమ్మన్‌దొడ్ల ఎస్సీ కాలనీకి చేరుకుని యువకులపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ దాడుల్లో గాయపడిన మణెయ్య కుమారుడు బాలు వెదురుకుప్పం పోలీసులను ఆశ్రయించి సంఘటనపై ఫిర్యాదు చేశాడు. రాత్రి పూట గ్రామంలో చొరబడి కాపు సామాజిక వర్గానికి చెందిన వారు దాడులు చేసి అలజడులు సృష్టించి భయాందోళనలకు గురి చేస్తున్నా రంటూ పోలీసులకు తెలియజేశాడు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని ఎస్సీ కాలనీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. నగరి డీఎస్పీ, కార్వేటినగరం సీఐ సత్యబాబు విచారణ చేపట్టి దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ దాడికి పాల్పడిన కోణంగిపల్లె గ్రామానికి చెందిన 15 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు శనివారం సాయంత్రం పోలీసులు తెలిపారు. దాడి చేసిన వారిలో కాపు వర్గానికి చెందిన కె.రుక్మాంగధరెడ్డి, గౌతమ్, జనార్దన్, కార్తీక్, లవకుమార్, గంగిరెడ్డి, ఏకాంబరం, లక్ష్మణ్, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, ఓబులురెడ్డి, విష్ణు, యుగంధర్, ఢిల్లీరెడ్డి, రాఖీ, మరి కొందరిపై అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇందులో ఇద్దరిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా బొమ్మన్‌దొడ్ల ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి నుంచి పికెటింగ్ నిర్వహించి ఎలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి జెడ్పీ చైర్మన్ నివాళి


నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు(ఇన్‌సెట్) భాస్కర్(ఫైల్)

వి.కోట: మండలంలోని ఓగు పంచాయతీ ముదరందొడ్డి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ మృతికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురై శనివారం అనారోగ్యంతో భాస్కర్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఆగ్రామానికి చేరుకున్నారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇంకా పలువురు నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.